ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 28 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:30 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4:54 (శనివారం ఉదయం)

బస్ డిపో ఏర్పాటుకు సన్నాహాలు

- నిర్మాణ పనులకు రూ.8.40 కోట్లు మంజూరు
- ఈ నెల 17న టెండర్ల ఆహ్వానం
- వచ్చే నెల 22న తెరవనున్న అధికారులు
- మే నెలలో ప్రారంభంకానున్న పనులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి ఆ సంస్థ సన్నాహాలు మొదలుపెట్టింది. ఈనెల 17వ తేదీన ములుగు జిల్లా ఏటూరునాగారంతోపాటు పెద్దపల్లి బస్ డిపో నిర్మాణానికి, ఇతర పనులకు తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చీఫ్ సివిల్ ఇంజినీర్ టెండర్లను ఆహ్వానించారు. పెద్దపల్లి బస్ డిపో నిర్మాణానికి 8 కోట్ల 40 లక్షల రూపాయలు ఆర్టీసీ మంజూరు చేసింది.

ఈ నిధులతో కేటాయించిన స్థలంలో గల వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాలను కూల్చి వేయడంతో పాటు బస్సులకు మరమ్మతులు చేసేందుకు గాను ఒక షెడ్డు, డిపో చుట్టూ ప్రహరీ నిర్మాణం ఇతర సివిల్ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేసేం దుకు గడువు విధించారు. అదే నెల 22వ తేదీన టెం డర్లను తెరిచి ఖరారు చేయనున్నారు. ఒప్పందాలు పూర్తయిన తర్వాత మే నెలలో డిపో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

డిపో ఏర్పాటుకు ఒక్కో అడుగు ముందుకు..

పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు ఒక్కో అడుగు ముందుకు పడుతూ వచ్చింది. జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఫ్యాక్టరీకి భూమి పూజ అనంతరం రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల చిరకాల వాంఛను నెర వేర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.

ఆయన ఇదే సభావేదికగా సీఎం దృష్టికి తీసుకవెళ్లి ఏడాది వరకు పెద్దపల్లిలో బస్ డిపోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతే గాకుండా ఎమ్మెల్యే బస్ డిపో మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. డిపో ఏర్పాటుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సెప్టెంబరులో స్థల పరిశీలన

సెప్టెంబరులో స్థల పరిశీలన మొదలుపెట్టారు. మొదట మంథని రోడ్డులో గల రాఘవాపూర్‌లో ప్రభుత్వ భూములు ఉండడంతో అక్కడి డిపో నిర్మాణానికి ప్రతిపాదించారు. ఆ స్థలం బస్టాండ్ నుంచి 5 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఆర్టీసీ అధికారులు నిబంధనల ప్రకారం బస్టాండ్‌కు డిపో 3 కిలోమీటర్ల దూరంలోనే ఉండాలని, ఆ స్థలంలో డిపో ఏర్పాటు చేయడం కుదరదని తేల్చి చెప్పారు. దీంతో బస్టాండ్ పక్కనే గల ఎంపీడీవో, విద్యా శాఖ కార్యాలయం, పంచాయతీ రాజ్ శాఖ, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం, ఐకేపీ భవనం, టాస్క్ కేంద్రం, పౌరసరఫరాల గోదాం గల 4.31 ఎక రాల స్థలాన్ని ప్రతిపాదించారు. ఈ స్థలం ఆర్టీసీకి ఇచ్చేందుకు కలెక్టర్ ముందుకు వచ్చారు. మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.14 కోట్లు రెవెన్యూ శాఖకు చెల్లించాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులకు లేఖ పంపారు. అంత సొమ్ము చెల్లించేందుకు

(మిగతా 8వపేజీలో)



విద్యుత్ ప్లాంట్‌ను త్వరగా ఏర్పాటు చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



గోదావరిఖని, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. నైజాంకాలంలో కాంగ్రెస్ హయాంలో 62 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించారని, దాని స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇక్కడ బొగ్గు, నీరు, ఇతర వనరులు ఉన్నప్పటికీ ప్లాంట్ నిర్మించకుండా యాదాద్రికి తరలించుకుపోయారని, 62మెగావాట్ల వాట్ల సానంలో 800మెగావాట్ల ప్లాంట్ నెలకొల్పితే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. విద్యుత్‌శాఖలో ఏండ్ల తరబడి పని చేస్తున్న ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

సుల్తానాబాద్, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. సుల్తానాబాద్ పద్మనాయక కళ్యాణ మండపంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతు రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసిందన్నారు. రామగుండం నియోజకవర్గంలో నాలుగు లక్షలు, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాలకు మూడు లక్షల చొప్పున ప్రత్యేక నిధులతో కార్యక్రమాలు చేపట్టామన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉండడంతో ఫోన్ ద్వారా పలువురికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, తహసీల్దార్ రాంచంద్రారావు, ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

కోల్‌సిటీటౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు శనివారం పర్యటించనున్నట్టు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, రాజ్‌కుమార్‌లు ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, వివిధ పరిశ్రమల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా సమీక్ష జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలో సమావేశం జరుగుతుందన్నారు. అట్రాసిటీ కేసుల పురోగతి, రుణాలు, ఉద్యోగుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళవచ్చని తెలిపారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



యంగ్ ఓరిటర్ ప్రోగ్రాం ముగింపులో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సమాజసేవలో యువత ముందుండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో బోస్ ఫెలోషిప్ వాలంటీర్లు చేపట్టిన యంగ్ ఓరిటర్ ప్రోగ్రాం ముగింపులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి కనీస అభ్యసన సామర్థ్యాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు వెనుకంజలో ఉండకుండా యువత ముందుకు వచ్చి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు స్వచ్ఛందంగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. బోస్‌ఫెలోషిప్ కార్యక్రమం కింద 8నెలల నుంచి వాలంటీర్లుగా పనిచేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక చేసిన 30ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేయడంపై కలెక్టర్ అభినందించారు. డిగ్రీ చదివే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంచుకొని దేశానికి ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు, ప్రాథమిక తరగతి పిల్లలు నిర్వహించిన వివిధ నృత్య ప్రదర్శనలు అలరించాయి. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ఎంఎంఓ డాక్టర్ షేక్, యంగ్ ఓరిటర్ విద్యార్థిని, విద్యార్థులు, బోస్ ఫెలోషిప్ వాలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలి

- రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయనున్న ఐకేపి కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన సెర్ప్ సీఈవో దివ్యతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పెంచాలని సీఎం ఆదేశాల మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపీలకు బదిలీ చేయాలన్నారు. పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని, దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా ప్రతీ మండలంలో గోదాముల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాంల కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు జిల్లా స్థాయిలో అనువైన భూములను గుర్తించాలని సూచించారు. మహిళల చేపట్టే పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న చిన్న హోటల్స్ మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామీణ సెల్ఫ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపిక చేయాలన్నారు. అనువైన స్థలం ఎంపిక చేసిన వెంటనే ఎన్ఆర్ఐటి నుంచి 50 లక్షల రూపాయల గ్రాంట్ వస్తుందన్నారు. వృద్ధాప్య ఫించన్‌దారులు మరణిస్తే ఆ కుటుంబంలో వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఆర్డిఓ ఎం కాళిందిని, అడిషనల్ డీఆర్‌డీఓ రవికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'కమలం'లో విభేదాలు

- జిల్లా కార్యవర్గంలో చోటు విషయంలో వాగ్వాదం



తోపులాడుకుంటున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కమిటీలో పదవుల కోసం ఆశావహుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ఎదుట ఈ ఘటన చోటుచేసుకొంది. గురువారం మాజీ ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ప్రెస్‌మీట్ అనంతరం ఇటీవల రద్దయిన జిల్లా కమిటీ కార్యవర్గంలో చోటు కల్పించలేదని వాగ్వాదానికి దిగారు. సుమారు అరగంట పాటు గొడవ జరిగింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు అడ్డుకున్నా తోపులాట కొనసాగింది. రద్దయిన జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించలేదని తోపులాడు కోవడంపై నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా బీజేపీలో మూడు వర్గాలు ఏర్పడి ఎవరికి వారే యమున తీరే అనే చందంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో గుజ్జుల రామకృష్ణా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌లు పార్టీ పిలుపు మేరకు వేర్వేరుగా కార్యక్రమాలు చేపడుతూ ప్రెస్‌మీట్లు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టె ముక్కుల సురేష్‌రెడ్డి ఒక్కడే ప్రెస్‌మీట్లు పెడుతున్నాడు. పార్టీలో ఈ పరిస్థితి కొనసాగుతుండగానే రద్దయిన కమిటీపై వాదనలు చేస్తున్నారు. మౌటం నర్సింగంకు ఉపాధ్యక్షుడు, అమరగాని ప్రదీప్‌కుమార్‌కు కార్యదర్శి, రాజవీరుకు జిల్లా కార్యవర్గంలో పదవి ఇస్తామని అధ్యక్షుడు కర్రె సంజీవ్‌రెడ్డి మాటిచ్చారు. అయితే ప్రకటించిన కార్యవర్గంలో మౌటం నర్సింగంకు కార్యదర్శి, అమరగాని ప్రదీప్‌కుమార్‌కు ఉపాధ్యక్ష పదవి ఇవ్వగా రాజవీరు ఏ పదవి దక్కలేదు. ఇచ్చిన మాట ప్రకారం పదవులు ఎందుకు రాయలేదని జిల్లా అధ్యక్షుడిని నిలదీశారు. చిలికి చిలికి గాలి వానలా తయారైంది. రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకొని కొత్త కమిటీలు వేసినప్పుడు సీనియర్లు, కార్యకర్తలను గుర్తించి పదవులు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దు మణిగింది.

బ్యాంకులలో భద్రత చర్యలు చేపట్టాలి



పెద్దపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్

పెద్దపల్లిటౌన్,మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులలో భద్రత చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎల్లమ్మ చెరువు కట్ట ప్రాంతం, మున్సిపాల్ కాంప్లెక్స్ ఏరియా ప్రాంతాలతో పాటు ఏటీఎం సెంటర్‌లను సందర్శించారు. అర్ధరాత్రి బయట తిరుగుతున్న వారిని ప్రశ్నించారు. పోలీస్ పెట్రోలింగ్‌తోపాటు, రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరిగే వారి గురించి, గంజాయి, మద్యం సేవించి తిరిగే ఆకతాయిల గురించి, ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద నుంచి డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఏటీఎం సెంటర్‌లలో అలారం సిస్టమ్, సీసీ కెమెరాల పనితీరు, ఇతర భద్రత విషయాలపై సెక్యూరిటీ గార్డ్‌ను తెలుసుకొన్నారు. బ్యాంకులలో అలారం సిస్టం, సీసీ కెమెరాల పనితీరు, సెక్యూరిటీ గార్డ్స్ ఇతర భద్రత ఏర్పాట్లు తనిఖీ చేసి అధికారులతో మాట్లాడారు. భద్రత చర్యలు సరిగా లేని బ్యాంకులలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మద్యం షాపులు, ఇతర వ్యాపార సంస్థలు సమయపాలనపై పోలీస్ కమిషనర్ పరిశీలించారు. డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్,ఎస్సై లక్ష్మన్‌రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 400 రేక్‌ల యూరియా రవాణా

- జెండా ఊపి ప్రారంభించిన సీజీఎం ఉదయ రాజ హన్స

6



ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర రూ.57.13లక్షల మోసం

- అద్దె అకౌంట్‌తో లావాదేవీలు
- అకౌంట్ అద్దెకు ఇచ్చిన మహారాష్ట్ర విద్యార్థి అరెస్టు

6

ఆక్సిజన్ ప్లాంట్‌కు తాళం

- ఖని జనరల్ ఆసుపత్రిలో రోగుల ఇబ్బందులు
- రెండు నెలలుగా పని చేయని ఆక్సిజన్ ప్లాంట్
- ప్రారంభానికి నోచుకోని లిక్విడ్ ఆక్సిజన్
- ప్రైవేట్ వ్యక్తులచే కొనుగోలు



ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మూసి ఉన్న ఆక్సిజన్ ప్లాంట్

కళ్యాణ్‌నగర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌కు తాళం వేయడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కరోనా సమయంలో ఎంతో మందికి ఆక్సిజన్ దొరకక ప్రాణాలను కోల్పోయారు. దీంతో కేంద్ర ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రుల్లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆక్సిజన్ ప్లాంట్లను నెలకొల్పింది. 2021లో ఆక్సిజన్ కొరత తీర్చడానికి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. మూడు సంవత్సరాల వరకు బాగానే పని చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను మెయింటెనెన్స్ చేయకపోవడంతో దానికి ఇప్పుడు తాళాలు వేశారు. నిమిషానికి 500లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేసే ఈ ప్లాంట్ ఒకేసారి 250మందికి ఆక్సిజన్‌ను అందిస్తుంది. 2021లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పీడీ రవీందర్‌రావు ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేసుకుని రెండో విడత కరోనా బారిన పడిన వారికి ఊపిరిని అందించింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలు నడిచిన ఈ ప్లాంట్ రామగుండం మెడికల్ కళాశాలకు అనుబంధంగా మారింది. అప్పటి నుంచి ఈ ప్లాంట్‌ను పట్టించుకోవడం లేదు. మూడు షిఫ్టుల్లో ముగ్గురు ప్లాంట్ నిర్వహణ చూసేవారు. చిన్న చిన్న లోపాలను సవరించకుండా ప్లాంట్‌కు తాళం వేయడంతో ఆక్సిజన్ లభించక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌స్టాల్ చేయని లిక్విడ్ ఆక్సిజన్

నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి ఆవరణలో నెల రోజుల క్రితం 10కేఎల్ గల లిక్విడ్ ఆక్సిజన్ పనులు పూర్తయినప్పటికీ దానిని ఇన్‌స్టాల్ చేయడం లేదు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న 80పడకల ఆసుపత్రిలో గ్యాస్ పైప్‌లైన్ పూర్తి చేసినప్పటికీ దానికి అనుసంధానం చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా బీ టైపు సిలిండర్లను వినియోగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో రోగులకు ఆక్సిజన్ లేక పరేషాన్ అవుతున్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు సిలిండర్ రవాణా అప్పగింత

ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నప్పటికీ దానిని నిర్వహణ చేయకుండా చెడిపోయిందంటూ మంచిర్యాల, జనగామకు చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లకు బి టైపు సిలిండర్లను సరఫరా చేయడానికి నెల రోజుల క్రితం టెండర్లు పిలిచింది. ఈ సిలిండర్లను రూ.700 నుంచి రూ.800లకు కొనుగోలు చేస్తున్నారు. జనగామకు చెందిన ఒక కాంట్రాక్టర్ రూ.400లకు క్రోడీకరణ చేసినప్పటికీ అతనికి టెండర్ ఇవ్వకుండా ఎక్కువ ధరకు మంచిర్యాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఉన్న ప్లాంట్‌ను మూల నపడేసి మరమ్మతు చేయకుండా ప్రైవేట్ వ్యక్తు లచే సిలిండర్లను సరఫరా చేయించడంపై గంద రగోళం నెలకొన్నది. కొందరు కమీషన్ల కోసమే ఆక్సిజన్ ప్లాంట్‌ను మరమ్మతు చేయకుండా, కొత్తగా వచ్చిన లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను ఇన్ స్టాల్ చేయకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనా అత్యవసర సమయంలో ఆక్సిజన్ లేక రోగులు తల్లడిల్లిపోతున్నారు.



ప్రభుత్వాసుపత్రి ఆవరణలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్

ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి



సమ్మయ్య (ఫైల్)

సైదాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామశివారులోని మొలంగూర్‌రోడ్‌లో గురువారం ట్రాక్టర్‌టైర్ కిందపడి డ్రైవర్ పొల్లు దాసరి సమ్మయ్య(57) మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన పొల్లుదాసరి సమ్మయ్య అదే గ్రామానికి చెందిన ఓవ్యక్తి ట్రాక్టర్‌లో లోడ్ వేసుకొని సైదాపూర్ నుంచి మొలంగూర్‌వైపు వెళ్తున్నాడు. ట్రాక్టర్‌ను లోలెవల్ వంతెన వద్ద ఆపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. అంతలోనే ట్రాక్టర్ చిన్నచిన్నగా కదులుతుండడంతో దానిని ఆపేందుకు సమ్మయ్య ప్రయత్నిస్తూ ట్రాక్టర్ ఎక్కబోయాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి ట్రాక్టర్ పెద్ద టైర్‌కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మంథనిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన మీసాల రాకేష్ (32) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రాకేష్ సోమవారం ఉదయం గడ్డి మందుతాగి ఇంటికి రాగా కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం మంథనికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందాడు. రాకేష్ ఆత్మహత్యకుగల కారణాలు పూర్తిగా తెలియరాలేదు.

అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య

అంతర్గాం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు తాళలేక తాటిపల్లి పద్మ(40) అనేగృహిణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినసంఘటన గురువారం రామగుండం పట్టణంలోని సీ కాలనీలో చోటుచేసుకుంది. రామగుండం ఎస్‌ఐ సంధ్యారాణి తెలిపిన వివరాలప్రకారం జెన్‌కో ఉద్యోగి అయిన తాటిపల్లి కృష్ణమూర్తి కుటుంబం రామగుండం సీ కాలనీలో నివాసముంటున్నారు. కృష్ణమూర్తి భార్య పద్మ కొన్నిసంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో భర్త ఇంట్లో లేని సమయంలో పద్మ వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్‌ఐ పంచనామా నిర్వహించి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

లారీ ఢీకొని విద్యార్థులకు తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బైపాస్ రహదారిలోని ముష్టిపల్లి చౌరస్తాలో గురువారం లారీ ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన ఉత్కం అజయ్, నీరటి భరత్‌లు సిరిసిల్లలోని కళాశాలకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా బైపాస్ రహదారిపై వెంకటాపూర్ వైపు నుంచి వేములవాడకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా లారీని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

● ఒకరికి తీవ్రగాయాలు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం చెక్‌పోస్టు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో కారు యాజమానికి తీవ్ర గాయాలైనట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి మట్టి లోడుతో వస్తున్న లారీ ఇందారం చెక్‌పోస్టు సమీపానికి రాగానే రహదారిపై లారీ ఆగిపోయింది. గోదావరిఖనికి చెందిన రేణికుంట్ల దత్తమూర్తి తన కారులో మంచిర్యాలకు వస్తుండగా ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాల య్యాడు. సంఘటన స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయాలపాలైన దత్తమూర్తి గోదావరిఖని ఎన్‌టీపీసీలోని అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటాడని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

తాడిచెట్టుపై నుంచి పడి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాడిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని మంగపేటలో చోటుచేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన తాళ్లపెల్లి శంకర్‌గౌడ్ (55)తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా తలకు, చేతులకు, నడుముకు గాయాలు కాగా పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బుర్ర సదానందంగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి నరసయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనంపై నుంచి పడి ఈశ్వర్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం ఆసుపత్రి ఆవరణలోని క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చేస్తున్న మేస్త్రీ ఈశ్వర్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా కాంట్రాక్టర్ రక్షణచర్యలను పాటించకపోవడం వల్లనేప్రమాదాలకు గురవుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ గురువారం గాయపడ్డారు. ద్విచక్ర వాహనం ఢీకొని గాయాలు కాగా పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు సుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు సంపత్‌ను మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం నందికమాన్ శివారులో ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీంతో సదరు వృద్ధురాలిని చికిత్సనిమిత్తం ఏరియాఆసుపత్రికి తరలించారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాచాపూర్ గ్రామానికి చెందిన ఇనుకొండ మల్లారెడ్డి అతని భార్య శ్రీలత భూతగాదాల విషయంలో సదయ్యను కులం పేరుతో దూషించారన్నారు. ఈ మేరకు సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

వరికి మొగి పురుగు

● మందులు స్ప్రేచేసినా తగ్గని ఉధృతి ● దిగుబడిపై ఆందోళనలో రైతులు



సారంగాపూర్ మండలంలో మొగి పురుగు ఆశించిన వరి పంట, వరి పైరును చూపుతున్న రైతు

సారంగాపూర్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు మొగి పురుగు ఆశించింది. ఈ సీజన్‌లో మండలంలో 10,800 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. బోర్లు, బావులు, చెరువు ఆయకట్టు కింద అధిక మొత్తంలో రైతులు వరినే పంటనే సాగు చేశారు. వరికి సోకిన మొగి పురుగు నివారణ కోసం రైతులు రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశారు. అయినా పురుగు ఉధృతి తగ్గకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు తీవ్ర ఆందోళన చెందతున్నారు. మండలంలో రెండు వ్యవసాయ క్లస్టర్లు ఉండగా సంబం ధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చినా సందర్భాలు లేవని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో మొత్తం 11 ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా కొందరు యజమానులు నాణ్యతలేని మందులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి రైతులకు నాణ్యమైన పురుగు మందులను అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

మందుల కోసం వేలు ఖర్చు చేశా

దేశరాజుల మధు, రైతు, బట్టపెల్లి

ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంటను సాగు చేశా. పంటలో మొగి పురుగు నివారణ కోసం వేలల్లో ఖర్చు చేసి రెండుసార్లు పురుగు మందులను పిచికారి చేశా. అయి నా మొగి పురుగు ఉధృతి మాత్రం తగ్గలేదు. మొగి పురుగు ప్రభావంతో ఊస పోయింది. దిగబడి తగ్గుతుందని ఆందోళనగా ఉంది.

నారు మడిలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండల వ్యవసాయ అధికారి, ప్రదీప్‌రెడ్డి

నారు మడి నుంచే సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే మొగి పురుగును నివారించవచ్చు. నాటు వేసే ముందు నారు కొనలను తుంచి నాటు వేసినట్లయితే వరిలో మొగిపురుగు వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఫర్టిలైజర్ దుకాణాలపై తనిఖీలు చేపట్టి నాణ్యతలేని మందులు అమ్మిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

వైన్స్‌లో చోరీకి యత్నం

శంకరపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్లితే గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పులో కొంత భాగం తొలగించి లోపలికి దూరారు. విద్యుత్‌సరఫరా నిలిపివేసి, ఇన్వర్టర్లు ధ్వంసం చేశారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వీడీఆర్‌బాక్స్‌తోపాటు రెండు బీరుసీసాలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొత్తపల్లి రవి, క్లూస్ టీమ్ సీఐ బృందం సభ్యులతో సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించి సంఘటనపై విచారణ చేపట్టారు.

రత్నాపూర్‌లో ఎక్సైజ్ దాడులు

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ గ్రామపంచాతీ పరిధిలోని రామగిరిఖిల్లా ప్రాంతంలో నాటుసారాయి తయారీ చేస్తున్నారనే పక్కా సమాచారం మేరకు గురువారం ఎక్సైజ్‌శాఖ ఎస్‌ఐ సాయికుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లంపానకంను ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిబ్బంది మహేందర్, శ్రీను, శ్యామ్, రవిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి27(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బిస్కు సత్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఆరేపల్లికి చెందిన గొల్ల చిన్న గంగయ్య మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుర్రవేణి కొండయ్య వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈనెల 26న రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న గంగయ్యను బిస్కు సత్యం తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టాడని చెప్పారు. తీవ్ర గాయాలపాలైన అతన్ని మొదట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారని తెలిపారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు చెందిన బాధితుడి బావమరిది కర్రోళ్లమల్లేశ్ ఫిర్యాదుతోకేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం మెయిన్ గేట్ వద్ద కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించగా ముగ్గురు వ్యక్తుల వద్ద 1 కిలో 180 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బైక్‌పై ముగ్గురుయువకులు పారిపోయే యత్నం చేశారని, వారిని అదుపులోకి తీసుకుని సోదాచేయగా గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు బీహార్ రాష్ట్రానికి చెందినవారిని వీరి ప్రస్తుత నివాసం అశోక్‌నగర్ అని తెలిపారు. నీరజ్‌కుమార్(20), సోరుకుమార్(19), దిలేందర్ కుమార్(29)లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, రాజన్న, హెడ్‌కానిస్టేబుల్ బషీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేర రూ. 57. 13లక్షల మోసం

● అద్దె అకౌంట్‌తో లావాదేవీలు ● అకౌంట్ అద్దెకు ఇచ్చిన మహారాష్ట్ర విద్యార్థి అరెస్టు



కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.57.13 లక్షలు మోసపోయాడు. గత ఏడాది జరిగిన ఈ సంఘటనలో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనకు ఆకర్షితుడైన గోదావరిఖనికి చెందిన వ్యక్తికి మాయ మాటలు చెప్పి సైబర్ నేరగాళ్లు ఉచ్చు బిగించారు. మహారాష్ట్రకు చెందిన ఒక విద్యార్థి అకౌంట్‌ను అద్దెకు తీసుకుని సైబర్ నేరగాళ్లు గోదావరిఖనికి చెందిన వ్యక్తి నుంచి రూ.57.13 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. బాధితుడు గత ఏడాది నవంబర్ 1న రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని డీఎస్‌పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయిన అకౌంట్ హోల్డర్ మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లా సపవాడి గ్రామానికి చెందిన శుభం నవనాథ్ శెల్కే(20) అనే విద్యార్థిదిగా గుర్తించారు. అతడిని విచారించగా తాను టెలీగ్రామ్ యాప్‌లో పరిచ యమైన ఒక వ్యక్తికి తన అకౌంట్‌ను నెలకు రూ.5వేలకు అద్దెకు ఇచ్చినట్టు పేర్కొన్నాడు. అకౌంట్ అద్దెకు ఇచ్చిన విద్యార్థి శుభం నవనాథ్ శెల్కేను గురు వారం అరెస్టు చేసినట్టు సైబర్ క్రైమ్ డీఎస్‌పీ వెంకటరమణ పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ కూడా ఆన్‌లైన్ గేమ్‌లు, ట్రేడింగ్ ఇన్వెస్టిమెంట్లు లోన్‌యాప్‌లు, డిజిటల్ అరెస్టు, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ, ఫెడెక్ కొరియర్ ఫ్రాడ్ పేర వచ్చే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు.

అర్ధరాత్రి నర్సింగాపూర్‌లో హంగామా

● యూట్యూబ్ యువతులపై దాడి

చందుర్తి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : ఓ పాట చిత్రీకరణ కోసం వచ్చిన యూట్యూబ్ ఛానల్‌యువతులపై ముగ్గురువ్యక్తులు మద్యం మత్తులో హంగామాచేసి దాడిచేశారు. ఈ ఘటన మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు మండలంలోని మూడపల్లి గ్రామంలోని బండపై ఒక పాటను చిత్రీకరించారు. రాత్రి కావడంతో విడిది కోసం నర్సింగాపూర్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ భోజనం చేసిన అనంతరం ఇంటిముందు కూర్చుని పాటలు వింటున్నారు. గ్రామానికి చెందిన గంగాధర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులువచ్చి తాము పోలీసులమంటూ బెదిరించారు. పది నిమిషాల్లో ఇక్కడ నుంచి ఖాళీచేసి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు పాల్పడడంతో, వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గ్రామానికిచెందిన వ్యక్తులు, యువతులపై దాడిచేయడంతోపాటు అసభ్యంగా ప్రవర్తించినట్లు యువతులు పేర్కొన్నారు. దీంతో 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని యువతులకు రక్షణ కల్పించేందుకు వేములవాడకు తరలించారు. ఈ సంఘటనపై జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన గుగ్గిళ్ల జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్క గంగాధర్, పెరుక శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

హుజూరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం సూపర్‌బజార్‌లోని మంజునాథ జ్యూవెలర్స్‌లో వెండి ఆభరణాలు దొంగతనం చేసిన ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంజునాథ జ్యూవెలర్స్‌లో ఆభరణాల కొనుగోలు పేరుతో గుర్తుతెలియని ఇద్దరు మహిళలు వెండి పట్ట గొలుసులు దొంగలించారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితురాళ్లను గుర్తించి వారికోసం పోలీసులు గాలిస్తుండగా హుజూరాబాద్ బస్టాండ్‌లో వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు.

అనుమతిలేని ఇటుక బట్టీలపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బటీలపై ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. అనుమతి లేని ఇటుక బట్టీలపై స్థానికులు, కాంగ్రెస్ నాయకుడు రాకేష్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గురువారం ఇటుక బట్టీల వద్దకు వెళ్లి విచారణ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడితో పాటు, ఇటుక బట్టీల వ్యాపారులతో విచారణ చేపట్టారు.వారంరోజుల్లో అనుమతిపత్రాలు సమర్పించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీవో వ్యాపారులకు తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 400 రేక్‌ల యూరియా రవాణా



400రేక్‌కు జెండా ఊపుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రైల్వే మార్గం ద్వారా 400రేక్‌ల యూరియాను రవాణా చేసినట్టు ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స చెప్పారు. గురువారం 400రేక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నాటికి 400రేక్‌లను తెలంగాణకు పంపినట్టు, ఆర్‌ఎఫ్‌సీఎల్ దేశంలోనే వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి రైతులకు సరసమైన ధరలో యూరియాను ఆర్‌ఎఫ్‌సీఎల్ అందిస్తుందన్నారు. పౌరులకు ఆహార భద్రత కల్పించేందుకు ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 11.70లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రవాణా చేశామన్నారు. యూరియా రవాణాకు కీలక పాత్ర పోషించిన కార్మికులకు కేంద్ర రసాయనాల, ఎరువుల మంత్రిత్వశాఖకు, వాటాదారులకు, రైల్వే అధికారులకు, తెలంగాణ పరిపాలనశాఖ అధికారులకు ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ రాజ హన్స కృతజ్ఞతలు తెలిపారు.

మహిళను వేధించిన యువకుడి అరెస్టు



బోగరి విజయ్‌కుమార్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన యువకుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సుందిళ్ల గ్రామానికి చెందిన బోగరి విజయ్ కుమార్ కొంత కాలంగా గోదావరిఖని గంగానగర్‌కు చెందిన ఓ మహిళను వేధిస్తున్నాడు. మహిళతో ఫోన్‌లో మాట్లాడిన మాటలను రికార్డు చేసి మహిళను వేధిస్తున్నాడన్నారు. ఎవరైనా మహిళలు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడడం, ఫొటోలు షేర్ చేయడం, మెసేజ్‌లు చేయరాదని, సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి గ్రూపుల్లో పోస్టు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొండగట్టులో పారిశుధ్య లోపం



మెట్లపై లేని రక్షణగోడ

● గదుల వద్ద మురుగు నీరు
● కూలిపోయిన వసతి గదుల మెట్ల రక్షణ గోడ
● పట్టించుకోని అధికారులు

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం వద్ద పారిశుధ్య లోపంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న మారుతి నిలయం వసతి సముదాయం పక్కనే గల హోటల్ నుంచి వ్యర్థపు నీరు బయటికి వచ్చి వసతి గదులు మెట్ల వద్ద చేరి దుర్వాసన వస్తోంది. దీంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. వ్యర్థపు నీటిని మురుగుకాలువలోకి తరలించాల్సి ఉండగా మెట్ల పైనే పైపుల నుంచి వ్యర్థపు నీటిని వదు లుతున్నారు. దుర్వాసనతో పాటు చెత్తతో కూడిన నీరు మెట్లపై ఉండడంతో భక్తులు గదులలోకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం భక్తులకు శాపంగా మారింది. అవే మెట్లపై నుంచి కొంచెం ముందుకు వెళ్లగా మెట్ల రక్షణగోడ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మెట్ల నుంచే భక్తులు గదులలోకి వెళ్లేటపుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



మెట్లపై హోటల్‌నుంచి వస్తున్న నీరు

ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల పునరుద్ధరణకు అవకాశం

తిమ్మాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) గుర్తింపు పొంది, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అనుబంధం రద్దయిన ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలలు తిరిగి అనుబంధం పొందుటకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అవకాశం ఇచ్చిందని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల ప్రైవేట్ డీఎల్ఎడ్ కళాశాలల యాజమాన్యాలు 2025-26నుంచి 2028-2029 విద్యాసంవత్సరానికి పునరుద్ధరణకు పూర్తిస్థాయి ప్రతిపాదనలను ఈనెల31లోగా రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణమండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకులు, హైదారాబాద్ వారికి సమర్పించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కున్న కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ఈ నెల 22న రాత్రి జరిగిన ఘటనలో నిందితుడు హుస్సేనిపురకు చెందిన ఆటోడ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేశామని కరీంనగర్ మూడోఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌రూరల్ మండలం చేగుర్తికి చెందిన సత్తు నరేందర్ గాంధీ చౌరస్తా వద్ద ఉండగా ఒక వ్యక్తి ఆటోలో వచ్చి నరేందర్‌ను బెదిరించి నెట్టివేసి సెల్‌ఫోన్ బలవంతంగా తాక్కెళ్లాడని తెలిపారు. బాధితుడి తలకు గాయాలుకాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని సోదరుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష

కోరుట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపుల కేసులో ఒకరికి ఒక సంవత్సరం కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ కోరుట్ల జెఎఫ్‌సీఎం జడ్జి పావని గురువారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్సై కథనం ప్రకారం.. కోరుట్లకు చెందిన రాముకు కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన యశోదకు 2007లో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తర్వాత అదనపు కట్నం తేవాలంటూ రాము తన భార్య యశోదను తరచూ వేధించేవాడు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 4వేల జరిమానా విధించాడు.





అడవిపదిరలో పిల్లర్లు పోసి వదిలేసిన వంతెన, అసంపూర్తిగా ఉన్న అడవిపదిర వంతెన

నిధులు సరిపోవు..

నిర్మాణాలు పూర్తి కావు

- అసంపూర్తి వంతెనలతో తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు

వీర్నపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలంలో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న వంతెనలు పూర్తయి అందుబాటులోకి వస్తే వాహనదారుల ప్రయాణం సురక్షితంగా సాగుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తేదారు నిర్లక్ష్యం..

వంతెనలు పూర్తిచేయకుండా వదిలేయడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడంలేదు. గుత్తేదారు కనీసం సరైన తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయక పోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. అడవి పదిరలో వానాకాలం వరి ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో రైతులు, గ్రామస్థుల సహ కారంతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. మళ్లీ యాసంగి ధాన్యం కోతకు వస్తుండటంతో సరైన రోడ్డు లేక లారీలు రావడానికి రైతులకు ఇబ్బందులు తప్పేలాలేవు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో వాగులు ఉధృతంగా వరదలు రావడంతో వంతెనలు పూర్తికాక రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పక్క గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

అదనపు నిధుల కోసం ఆరాటం..

వీర్నపల్లి మండలంలో అడవిపదిర, బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామాల పరిధిలోని హైలెవల్ వంతెనలు నిధులు సరిపోక నిర్మాణాలు ఆగిపోయాయి. అడవిపదిర గ్రామంలో రూ.2కోట్ల ఎమ్ఆర్ఆర్ గ్రాంట్ నిధులతో వంతెన నిర్మాణ పనులు చేపట్టి పిల్లర్లు పోసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామ పరిధిలోని గోన్యా నాయక్ తండాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో వంతెన పనులు చేపట్టి అప్రోచ్‌రోడ్డు, సైడ్‌వాల్ నిర్మాణాలు ఆగిపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. వంతెన నిర్మాణాలు పూర్తయ్యేందుకు అదనపు నిధులు అవసరం ఉందని ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. అప్రోచ్ రోడ్లకు, స్లాబ్ పనులకు అదనపు నిధులు మంజూరయితే వంతెన పనులు పూర్తయి ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. పాలకులు, ఉన్నతాధికారులు మారుమూల అటవీ గ్రామాలపై దృష్టి పెట్టి అసంపూర్తి వంతెనలను పూర్తిచేసి ప్రజల అవస్థలను తొలగించాలని కోరుతున్నారు.



గొన్యా నాయక్ తండాలో అసంపూర్తిగా ఉన్న వంతెన

రెండేళ్లు దాటినా వంతెన పూర్తికాలేదు..



జాలపల్లి మనోజ్ కుమార్, అడవిపదిర

గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టి రెండేళ్లు దాటినా పనులు పూర్తికాలేదు. కనీసం కాంట్రాక్టర్ తాత్కాలిక రోడ్డు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థుల సహకారంతో ఒకరోజు నిరాహార దీక్ష చేసినా ఫలితం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకుని వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

ప్రతిపాదనలు పంపాం..



శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈఈ

అడవిపదిర, గోన్యా నాయక్ తండాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హైలెవల్ వంతెనలకు నిధులు సరిపోక అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రభుత్వానికి అదనపు నిధుల కోసం నివేదికలను పంపించాం. నిధులు మంజూరు కాగానే వంతెనల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



సాయికృష్ణ(ఫైల్)

మల్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనం టాప్‌పై కూర్చున్న ఇద్దరు గురువారం ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఇందులో సాయికృష్ణ (17) అనే బాలుడు మృతిచెందగా సంపంగి ప్రేమ్‌చంద్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన శివరాత్రి లింగయ్య కుటుంబసభ్యులు, బంధువులతో గురువారం ఆంజనేయస్వామిని దర్శించుకొని ట్రాలీ ఆటోలో తిరుగుపయనం అవుతుండగా ప్రమాదం జరిగింది. ఘాట్‌రోడ్డు దిగుతుండగా వాహనం టాప్‌పై లింగయ్య కొడుకు సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కూర్చున్నారు. భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్ సాయిక్రిష్ణకు తగలడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేయడంతో వాహనం టాప్‌పై కూర్చున్న సాయిక్రిష్ణ, సంపంగి ప్రేమ్‌చంద్ కిందపడ్డారు. వారిపై నుంచి అదే వాహనం వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతి చెందాడు. కాగా లింగయ్య కుటుంబం బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని గురువారం కొండగట్టుగా రాగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

- కిష్టునాయక్‌తండాలో విషదం..

ఎల్లారెడ్డిపేట : మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని బాలుడు శివరాత్రి సాయికృష్ణ(17) దుర్మరణం పాలయ్యాడని కుటుంబ సభ్యులు, స్థానికులు గురువారం తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని శివరాత్రి విజయ-లింగం దంపతులు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కొడుకు సాయికృష్ణ 8వ తరగతి వరకు చదువుని మధ్యలోనే ఆపేశాడు. విజయ-లింగం దంపతులు కొడుకు సాయికృష్ణతో కలిసి తన బంధువులు కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి ఆటోలో బయలుదేరారు. మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తున్న క్రమంలో ఆటోపైన కూర్చున్న సాయికృష్ణ ఒక్కసారిగా కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనితోపాటు మరోవ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ సాయికృష్ణ మృతిచెందాడు. బాలుడి మృతిలో కిష్టునాయక్‌తండాలో విషాదం నెలకొంది.

రాజన్న ఆలయంలో ఘనంగా మహాలింగార్చన

వేములవాడ కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమం అర్చకులు ఘనంగా నిర్వహించారు ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయ కల్యాణ మండపంలో లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న ఆలయంలో మహాలింగార్చన

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కోరుట్ల రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షలో ఇన్విజిలేషన్ నిర్వహణలో వివాదాస్పదమైన ఉపాధ్యాయుడు నజీమొద్దీన్‌ను గురువారం జిల్లా విద్యాధికారి రాములు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో నరేశం తెలిపారు. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రంలో అధికారులను తప్పుదోవ పట్టించి కూతురు పరీక్ష రాస్తున్న కేంద్రంలో ఇన్విజిలేషన్ నిర్వహించడాన్ని గుర్తించి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నట్లు నరేశం తెలిపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు మరింత లోతుగా విచారిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలి



ఎస్‌యూ వీసీకి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్తకార్యదర్శి మల్యాల రాకేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌కు తరలించడం సరికాదన్నారు. వీసీ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికితీసు కెళ్తామని మరిన్ని కొత్తకోర్సులు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జల్లపల్లి అంజన్న, గంట కిరణ్మయి, పూసాల విష్ణు, బాలకృష్ణ, కార్యదర్శి సాగర్, నగర కార్యదర్శి నందు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి

- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలన్నింటికీ రాజ్యాంగ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సమాజంలో చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని తారకరామనగర్, గాంధీనగర్ కాలనీల్లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాల లక్ష్మీల బృందం పర్యటించింది. కాలనీలో పర్యటించి ఆయా కులాల జీవన స్థితి గతులు, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశాల్లో చైర్మన్ నిరంజన్ మాట్లాడారు. చులకన భావంతో కులాలను చూడడం వల్ల ఆయా కులస్థులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి సునీత, తహసీల్దార్ వీరభద్రయ్య, కుల సంఘం నాయకులు కడారి రాజేందర్, శ్రీనివాస్, కనకయ్య, తిరుపతి, దొమ్మర కుల సంఘం నాయకులు చంద బాబు, జూపల్లి తిరుపతి, చంద రమేష్, జూపల్లి విజయ్, ముస్కు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం..

బీసీ కులాల్లోని వీరముష్టి, పిచ్చకుంట్ల, దొమ్మర కులాల స్థితిగతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరింపజేస్తామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కులాల పేరు మార్పు కొరకు బీసీ కమిషన్‌కు అనేక విజ్ఞాపన పత్రాలు అందుతున్నాయన్నారు. కులాల పేరు మార్పు కొరకు ఇప్పటికే ఆయా కులాల ప్రతినిధులతో చర్చించామన్నారు. జిల్లాల పర్యటనలో పరిశీలన అనంతరం ఈనెల 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పరిస్థితిని తీసుకవెళ్తామన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అత్యంత పేదలను గుర్తించి అందులో అర్హత కల్పించడానికి కృషి చేస్తామన్నారు.

- కులాల పేర్లను మార్చేందుకు చర్యలు..

ధర్మపురి: సమాజంలో నేటికి చులకన భావంతో పిలిచే కులాల పేర్లను గౌరవప్రదంగా పిలిచేలా వాటిని మార్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని దుర్గమ్మ కాలనీలో బీసీ కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు దుర్గకాలనీలో దొమ్మరులు, వీరముష్టి కులస్థుల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కమీషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, ప్రత్యేక అధికారి సతీష్, బీసీ సంక్షేమ జిల్లా అధికారి కల్పన, మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గట్టు మల్లన్న జాతర



పూజలు చేస్తున్న భక్తులు

చొప్పదండి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లెలోని గట్టుమల్లన్న జాతర వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలను నిర్వహించారు.

దేశరాజుపల్లి పల్లె దవాఖానాకు ఎన్‌క్వాస్ అవార్డు



దేశరాజుపల్లి పల్లె దవాఖానా వద్ద సిబ్బంది

రామడుగు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేశరాజుపల్లి పల్లెదవాఖానాకు ఎన్‌క్వాస్ కింద నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమ అవార్డు దక్కింది. నేషనల్ సిస్టం రిసోర్స్‌సెంటర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌క్వాస్ బృందం ప్రభుత్వ ఆసుపత్రులను మార్చి1న తనిఖీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 8 పల్లె దవాఖానాలకు ఎన్‌క్వాస్ నాణ్యత సర్టిఫికెట్‌తోపాటు ఉత్తమఅవార్డులకు ఎంపికచేశారు. ఇందులో రామడుగు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దేశరాజుపల్లె దవాఖానా 88.12శాతం మార్కులతో ఈ ఉత్తమఅవార్డును దక్కించుకుంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే అవార్డు దక్కిందని మండల వైద్యాధికారి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆసుపత్రిలో కాయకల్ప బృందం

వేములవాడ టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని కాయకాల్పబృందం గురువారం సందర్శించింది. ఆసుపత్రిలో అందుతున్న సేవలను, ఆసుపత్రి పరిశుభ్రతను గురించి బృందంసభ్యులు తెలుసుకున్నారు. మూడు సంవత్సరాలుగా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందుతూ వస్తున్నది. ఈసారి కూడా అదేస్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ పెంచలయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ అనిల్, డాక్టర్ చారి, డాక్టర్ సుభాషిణి, నర్సింగ్ సూపెరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, విజయలక్ష్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



పతకంతో విక్రమ్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు జిల్లాకు చెందిన ఎం విక్రమ్ కుమార్ ఎంపికైనట్లు కరీంనగర్ జిల్లా జూడో సంఘం కన్వీనర్ దామోదర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సలార్ ఈ మిలాద్ ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల24న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల జూడో పోటీల్లో పాల్గొన్న వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎం విక్రమ్ కుమార్ 100 కేజీలపై విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విక్రమ్ కుమార్‌ను జూడో సంఘ ప్రతి నిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- మూడు బైక్‌లు స్వాధీనం
- చోరీ జరిగిన గంటలోనే ఛేదన

గంభీరావుపేట(ఎల్లారెడ్డిపేట), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చోరీ జరిగిన గంటలోనే గంభీరావుపేట ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం ఛేదించారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకుని అతని వద్ద నుంచి మూడు బైక్‌లను స్వాధీనపర్చుకున్నారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. మండలంలోని జగదాంబ తండా గ్రామానికి చెందిన బాదావత్ గోపాల్ ఈనెల 26న రాత్రి తన కోళ్ల పారం వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపి గేటుకు తాళం వేసి ఇంటికి చేరుకున్నాడు. ఈనెల 27న ఉదయం కోళ్ల పారం వద్ద వెళ్లి చూసేసరికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు గోపాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంతో అనుమానాస్పదంగా కనిపించిన కామారెడ్డి పట్టణానికి చెందిన మహ్మద్ మున్నీరును పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించారు. గంభీరావుపేట, కామారెడ్డి పట్టణాల్లో బైక్‌లను దొంగించానని అంగీకరించాడు. వాహనాలను స్వాధీనపర్చుకుని నిందితుడు మహ్మద్ మున్నీరును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్‌ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ బాల శ్రీనివాస్‌ను ఎస్‌ఐ శ్రీకాంత్ అభినందించారు.

గురుకులం విద్యార్థికి అస్వస్థత

- కోరుట్లలో చికిత్స అనంతరం డిశ్చార్జ్
- జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి, 27(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకులానికి చెందిన విద్యార్థి రాపర్తి హర్ష అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి చేర్పించి చికిత్స అందించారు. గురువారం ఉదయం తరగతి గదిలో ఉన్న సమయంలో చేయి నొప్పిగా ఉందని ఉపాధ్యాయుడికి తెలపగా వెంటనే ప్రిన్సిపాల్ మాధవిలతకు సమాచారమిచ్చారు. ప్రిన్సిపాల్ వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు విషయం తెలిపిన అనంతరం కోరుట్ల పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. చీమలు కుట్టడంతో విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడని ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ విద్యార్థిని పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఇంటికి పంపించినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. వెంటనే గురుకులంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు పరీక్షలు చేశారు. 56మంది విద్యార్థులకు స్కిన్ ఎలర్జీ, కడుపునొప్పి ఉన్నట్లు గుర్తించి వారికి మందులు అందజేశారు.



విద్యార్థిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

బస్ డిపో ఏర్పాటుకు సన్నాహాలు

5వ పేజీ తరువాయి

ఆర్టీసీ సుము ఖత వ్యక్తం చేయలేదు. డిసెంబర్ 4న పెద్దపల్లిలో జరిగిన యువ వికాసం సీఎం సభకు ముందు రోజు పెద్దపల్లిలో ఆర్టీసీ డిపోను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా స్థలాన్ని అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. ఆ స్థలంలో ఉన్న కార్యాలయాలను జనవరి మొదటి వారంలో తరలించారు. స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ అధికారులు డిపో కార్యాలయానికి అందులో గల టాస్క్ కేంద్రం, ఐకేపీ భవనాలను సద్వినియోగం చేసు కోవడంతోపాటు, బస్సుల రిపేర్ కోసం పౌరసరఫరాల గోదాంను వాడుకోవాలని భావిస్తున్నారు. డిపో నిర్మాణ పనులు మే నెలలో ఆరంభిస్తే, డిపో దసరా లేదా దీపావళి నాటికి ప్రారంభించే అవకాశాలున్నాయి.

డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

మంథని, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యూపీ రాజధాని లక్నోలో ఈనెల 23న జరిగిన హోమియో విజన్ 2.0 నేషనల్ కాన్ఫరెన్స్‌లో మంథనికి చెం దిన ప్రొఫెసర్ డాక్టర్ సువర్ణ ప్రవీణ్‌కుమార్ బెస్ట్ టీచర్ అవార్డు అందు కున్నారు. ప్రవీణ్‌కుమార్ హైదరాబాదులోని జయసూర్య పొట్టి శ్రీరాములు హోమియోపతి మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేసి ఇటీవల రిటైర్డు అయ్యారు. హోమియోపతి రంగంలో ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్సీ యూపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుప్ గుప్తా, ఎన్‌సీ హెచ్ మెంబర్ డాక్టర్ ఆనందర్ చతుర్వేది, సీసీహెచ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రాంజీసింగ్, ఎన్ఐహెచ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్‌సింగ్‌ల సమక్షంలో అవార్డును అందజేశారు. కరోనా సమయంలో శ్రీసీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో మంథని ప్రజలకు హోమియోపతి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అవార్డు రావడంపై ఆయన స్నేహితులు లోకే రాధాకిష న్‌రావు, నగునూరి శేఖర్, రావికంటి మనోహర్, చంద్రశేఖర్, ఇల్లెందుల సత్యనారాయణ, ఎర్ర సురేష్‌కుమార్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రార్థనలు చేసే ఈద్గా వద్ద ఏర్పాట్లను గురువారం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరిశీలించారు. చందపల్లి రోడ్‌లో గల ఈద్గా ప్రార్థన స్థలంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు ఈద్గా వద్ద పనులు పూర్తి చేస్తున్నా మన్నారు. ఉగాది పండుగ ఆదివారం ఉన్నందున అందరూ ఆహ్లాదకర మైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధి కారి వినయ్, మాజీ కౌన్సిలర్ షాహీధ సబీర్ ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు పాల్గొన్నారు

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలోని మజీద్‌లో ముస్లిం సోదరులకు గురువారం రియల్టర్‌లు కుందారపు సంతోష్, బూరు గురాజుగౌడ్, శ్యామ్‌యాదవ్‌లు ఇఫ్తార్ విందు ఇచ్చారు. హిందు, ముస్లీం తేడాలు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో జీవించాలన్నారు. సింగ రేణి కార్మికుడు రేండ్ల కుమారస్వామి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. లొంకకేసారం మాజీ సర్పంచ్ ఎండి మంజూర్, మజీద్‌కమీటి నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

ముత్తారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమాని స్తున్నారని తెలంగాణ అయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, మంథని నియోజకవర్గ కోఆర్డినేటర్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. గురువా రం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిధిగా హాజరైనా జంగా రాఘవరెడ్డి, దుద్దిళ్ల శ్రీనుబాబులు హాజరై మాట్లాడారు. మహత్మగాంధీ, అంబేద్కర్, రాజ్యాంగాన్ని గౌరవించు కోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జైబాపు, జైభీం, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని, వారి ఆదేశాల మేరకు కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపాలిటీలో దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం ఎంపీ డీవో కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులను స్వీకరించారు. నిరుద్యోగ అభ్యర్థులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వివరా లను ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్‌రావు వెల్లడించారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయేతర పథకాల కోసం యాభై వేల రూపాయల యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వందశాతం సబ్సిడీ ఇస్తారన్నారు. యాభై నుంచి లక్ష రూపాయల యూనిట్‌కు 90శాతం, ఒకటి నుంచి రెండు లక్షలలోపు యూనిట్‌కు 80, రెండు నుంచి నాలుగు లక్షల విలువ గల యూనిట్లకు 70 శాతం వరకు సబ్సిడీని ఇస్తుందన్నారు. మైనర్ ఇరిగేషన్



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీడీవో

వ్యవసాయ యూనిట్లకు, విధి వంచితులకు, దివ్యాం గులకు, నిరుపేదలకు సబ్సిడీ వర్తిస్తుంది. వ్యవసాయే తర లబ్ధిదారులు 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల వయస్సు ఉండాలని, వ్యవసాయ యూనిట్ల కోసం లబ్ధిదారులు అరవై ఏళ్ల వయస్సు ఉండాలని తెలిపారు.

● **దరఖాస్తు విధానం**

మీసేవా కేంద్రాలలోలేదా tsobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేయవచ్చు. దరఖా స్తుల ప్రింట్ అవుట్, ఫొటోతోపాటు ఆధార్, రేషన్ కార్డు లేదా ఇన్‌కమ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రా లను జత చేసి మండల పరిషత్, మున్సిపాలిటిలో అం దజేయాలి. గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు లక్షా యాభై వేల వార్షిక ఆదాయం, అర్బన్ ప్రాంత అభ్యర్థులకు రెండు లక్షల వార్షిక ఆదాయం ఉండాలి. దరఖాస్తులను ఏప్రిల్ 5 వరకు సమర్పించాలి

● **ఏప్రిల్ 6 నుంచి 21 వరకు పరిశీలన**

ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దర ఖాస్తులను ఏప్రిల్ ఆరు నుంచి 21 వరకు వివిధ ప్రక్రి యలను పూర్తి చేసేందుకు పరిశీలిస్తాం. పరిశీలనలు, క్షేత్ర స్థాయిలో తనిఖీలు, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారు. జాబితాను జిల్లా ఉన్నతాధికారికి, జిల్లా కమి టీకి పంపిస్తారు. సందేహాలుంటే ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్‌లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి.

రైతు రుణమాఫీ బూటకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల

పెద్దపల్లిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అబద్దాలు ప్రచారం చేస్తోందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే విజయరమణారావు సొంత ఊరిలో సర్వే చేయడానికి తాము సిద్ధమని, ఎంతమంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ అయ్యిందో తేలుతుందని స్పష్టం చేశారు. రూ.2 లక్షల కంటే అధికంగా రుణాలు పొం దిన రైతుల పరిస్థితి ఏంటని, సరైన విధానం అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రంలోని రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి సత్వరమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డీ 83 ద్వారా చివరి ఆయకట్టు భూములకు నీరందించాలని కోరారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపు గడువు తేదీని మరో నెలరోజులు పొడిగించాలని గుజ్జుల డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ హనుమాన్ మాలధారణ చేసిన విద్యార్థి పట్ల అనుచితంగా వ్యవహరించిన సెయింట్‌ఆన్స్ పాఠశాల అనుమతులు రద్దు చేయా లని డిమాండ్ చేశారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పర్శ సమ్మయ్య, కడారి అశోక్ రావు, చక్రధర్ రెడ్డి, పాల్గొన్నారు

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలేవి

పెద్దపల్లిటౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనసాగు తున్న అక్రమ మట్టిదందాపై అధి కారుల చర్యలేవి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని కొత్త పల్లిలో కొంతకాలంగా ఆరుగురు ఇటుక బట్టీల యజమానులు మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ మొత్తంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, విషయం వెలుగులోకి రావడంతో కొన్ని రోజులు నిలిపివేశారన్నారు. అధికారులు మళ్ళీ అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన నివేదిక ప్రకారం 70 వేల మెట్రిక్ టన్నులకుగాను లక్షా 65 వేల మెట్రిక్ టన్నుల మట్టిని తవ్వుకున్నారని పేర్కొన్నారు. దీనిపై ఒక్కో కంపెనీకి రూ.38 లక్షల 56 వేల 329 జరిమానా విధించారని వివరించారు. జరిమానా చెల్లించకుండానే ఇటుకబట్టీల యాజమాన్యం మట్టిని తరలించడంపై సురేష్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే అక్రమంగా ఇసుక, మట్టి దందా చేస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాడని, తాను గెలిచిన వెంటనే జైల్‌కు పంపిస్తా అంటూ తొడగొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మూడేళ్ళుగా ఇసుక, మట్టి తవ్వకాలపై న్యాయస్థానాల్లో అలుపెరుగని పోరాటం చేస్తున్నానని, ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో విజయం సాధించానని తెలిపారు. ఇటుకబట్టీల యజమానులకు వేసి న జరిమానాను ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించాలని సురేష్ రెడ్డి కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిబాబు



హరిబాబు

మంథని, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మం థని బార్ అసోయేషన్ అధ్యక్షుడిగా సీనియర్ అడ్వకేట్ కేవీఎల్ఎన్ హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురు వారం నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్ని కల అధికారి పాపయ్య తెలిపారు. ఉపాధ్యక్షు డిగా కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, జాయింట్ సెక్రె టరీగా విజయ్‌కుమార్, కోశాధికారిగా రాచర్ల రాజేందర్, లైబ్రరీ సెక్రెటరీగా శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా ఆర్ల నాగ రాజు, ఈసీ మెంబర్స్‌గా సంతోష్, సబానాలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. న్యాయవా దుల సమస్యలపై పోరాడుతామని పాలకవ ర్గం వెల్లడించారు. బార్ అసోసియేషన్ అధ్య క్షుడిగా హరిబాబు ఎన్నిక కావడంపై పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బోస్ ఫెలోషిప్ ప్రశంసా పత్రాలు



కలెక్టర్ చే ప్రశంసా పత్రాలు పొందిన ప్రిన్సిపాల్, విద్యార్థినులు

సుల్తానాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాణి పీజీ కళాశాల ప్రిన్సి పాల్ బండారు కమలాకర్, ఇద్దరు విద్యార్థి నులకు బోస్ ఫెలోషిప్ వారు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యా కదంబంలో భాగంగా నిర్వహిస్తున్న పలు విద్యాభివృద్ధి సేవలను నిర్వహిస్తున్న సుల్తానాబాద్ శ్రీ వాణి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కమలాకర్ ప్రోత్సాహంతో ఇదే కళాశాలలో చదువుతున్న కాట్నపల్లి గ్రామానికి చెందిన నోముల భావన, పెగడపల్లి గ్రామానికి చెందిన తమ్మి శెట్టి రమాదేవి అనే విద్యార్థినులు గ్రామం లోని విద్యార్థులకు బేసిక్ తరగతులను తొమ్మిది నెలలుగా నిర్వహిస్తున్నారు. ఈ సేవ లను గుర్తించి ప్రశంసా పత్రాలు అందజేశా రని ప్రిన్సిపాల్ కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): హను మాన్‌నగర్‌లో శుక్రవారం ఉచిత గుండె నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మాజీ కార్పొరేటర్ కొంద్ర స్టాలిన్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ మెడి కవర్ హాస్పిటల్ సహకారంతో మధుమేహం, రక్తపోటు తోపాటు ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. హనుమాన్‌నగర్‌లోని జనతాగ్యారేజీలో వైద్యు లు అందుబాటులో ఉంటారని, స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మల్లన్న ఆలయ హుండీల లెక్కింపు



ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

ఓదెల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లోని బ్రమరాంభ మల్లిఖార్జునస్వామి ఆలయంలో గురు వారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుండీల ద్వారా రూ.33 లక్షల 59 వేల 130 నగదు, 900 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, 7 కిలోల 200 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఆలయ ఈవో సద య్య తెలిపారు. అలాగే 2024 సెప్టెంబరు నుండి 2025 ఫిబ్రవరి వరకు నిర్వహించిన జాతరలో 16 హుండీలకు విప్పి లెక్కించగా ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. పర్యవేక్షణాధికారి శ్రీనివాస్, అర్చకులు, బ్యాంకు ఉద్యో గులు, పోలీస్ సిబ్బంది, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

ధర్మారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచులు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్ట్‌లు చేపట్టారు. రావాల్సిన బిల్లుల కోసం పోరాడుతుంటే గురువారం తెల్లవారుజామునే స్టేషన్లో బంధించడం అన్యాయమని మాజీ సర్పంచు లు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు క్రీడా ప్రాంగాణాలు, పల్లె పకృతి వనాలు, పల్లె దవా ఖానాలకు సొంతంగా డబ్బులు పెట్టామన్నారు. వాటి బిల్లులు రాకుండా సంవత్సరాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. మాజీ సర్పంచులు సాగంటి కొండయ్య, కోమ టిరెడ్డి బుచ్చిరెడ్డి, జనగామ అంజయ్య, గంధం నారాయణ, చెనెల్లి సాయి కుమార్‌లు ఉన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులను పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో వివిధ అభి వృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. పోలీసులు కాట్నపల్లి మాజీ సర్పంచ్ మొరపల్లి మోహన్‌రెడ్డి, నారాయణరావుపల్లి, మియా పూర్, గర్రెపల్లి గ్రామాలకు చెందిన మొల్గూరి అంజ య్యగౌడ్, అరుణ్, వీరగోని రమేష్ గౌడ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): నాగేపల్లి, రాజాపూర్ మాజీ సర్పంచ్‌లు ఓదెలుయాదవ్, పాశం ఓదెలను గురువారం పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కోసం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లు కోసం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో ఎస్ఐ చంద్రకుమార్ మాజీ సర్పంచ్‌ల అరెస్ట్ చేసి సొంత పూచికత్తుల పై విడుదల చేశారు.

మహిళల సాధికారతే ధ్యేయం

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): గ్రామం లోని ప్రతీ మహిళా స్వయం సాధికారతే తన ధ్యేయమని సామాజిక భాధ్యురాలు రేండ్ల శారద కుమారస్వామి వెల్లడించారు. గురువారం కల్వ చర్లలో ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం ద్వారా నిర్వహి స్తున్న ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. 3వందల మందికి సొంత ఖర్చుల తో ఉచిత కుట్టు శిక్షణ కల్పించి రెండవ బ్యాచ్‌కు న్యాక్ పర్యవేక్షణలో అర్హత పరీక్షను చేపట్టారు. గురువారం నిర్వహించిన అర్హత పరీక్షల్లో 30 మంది అర్హత సాధించారు. వీరికి సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. న్యాక్ సిబ్బందితో పాటు శిక్షకులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ పరీక్షల్లో రేండ్ల శారదకుమారస్వామి

వివాహానికి లయన్స్‌క్లబ్ చేయూత

సుల్తానాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన వెంగళ రమ తండ్రి పన్నెండేళ్ల క్రితం చని పోగా రమ పెళ్లి ఖర్చులకు దాతల సహకారంతో 2013లో పదమూడు వేల రూపాయలను బ్యాంకులో డిపాజిట్ చేశారు. ప్రస్తుతం అవి రూ.32 వేలకు చేరగా వాటిని గురువారం రమకు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు నీలయ్య, జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, సతీష్, అనిల్, శరత్, వెంకన్న పాల్గొన్నారు.

దుకాణ సముదాయాలకు బహిరంగ వేలం

సుల్తానాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని దుకాణ సముదాయ గదులకు గురువారం అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఒకటవ దుకాణానికి డీకొండ శ్రీనివాస్ రూ.6100లకు దక్కించుకున్నారు. రెండో దుకాణాన్ని గాజుల కృష్ణ రూ.7600, ఆవుదుర్తి అనిల్ రూ.5300, నాలుగవ దుకాణానికి పొట్ల కుమార్ రూ.7800, ఐదవ దుకాణాన్ని గున్నా ల అభి రూ.7700లకు దక్కించుకున్నారు. దుకాణాలు దక్కించుకున్న వారు ప్రతీ నెల కిరాయి మొత్తాన్ని సకాలంలో గ్రామ పం చాయతీకి చెల్లించాలని అధికారులు తెలి పారు. గర్రెపల్లి పశువుల సంతకు వేలం పాటలు నిర్వహించగా డీకొండ శ్రీనివాస్ ఆరు లక్షల నలభై వేల రూపాయలకు సొం తం చేసుకున్నారు. కూరగాయల సంతకు పడాల రంగస్వామి అరవై వేల రూపాయ లకు పొందారు. ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, ఎంపీఓ సమ్మిరెడ్డి, కార్యదర్శి లచ్చయ్య, కారోబార్ జొన్నకోటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్ ప్రగతినగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసు పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 200మందికి 2డీ ఎకో, బీపీ, షుగర్ వైద్య పరీక్షలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మా ట్లాడుతూ ఇటీవల గుండెపోటు మరణాలు ఎక్కువవుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలతరాజు, డీఎంఓ హర్షిత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, బొంగోని హరీష్, యూనస్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా విద్యార్థులకు మేలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27 (ఆంధ్ర జ్యోతి): శాతవాహన యూనివర్సిటీకి అనుబం ధంగా ఇంజనీరింగ్, న్యాయ కళాశాలలను మంజూరు చేయడం ద్వారా ఉమ్మడి కరీం నగర్ జిల్లా విద్యార్థులకు మేలు జరుగుతుం దని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరికి మహేష్ ప్రకటనలో పేర్కొన్నారు. యూ నివర్సిటీ లా కాలేజీకి 23 కోట్లు, ఇంజనీరింగ్ కాలేజీకి 44 కోట్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక యూనివ ర్సిటీల వైస్ చాన్స్‌లర్లతోపాటు అవసరమైన నిధులను కేటాయించినట్లు పేర్కొన్నారు.

ఓసీపీ-2 బ్లాస్టింగ్‌లపై రాజాపూర్‌లో గ్రామస్థుల ధర్నా



రాజాపూర్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

రామగిరి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో గురువారం నిర్వహించిన బ్లాస్టింగ్‌లపై రాజాపూర్ గ్రామస్థులు ధర్నా చేపట్టారు. ప్రాజెక్టులో జరిగిన భారీ పేలుళ్లపై ఆందోళన వ్యక్తం చేస్తూ మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారి రాజాపూర్ బస్‌స్టాప్ వద్ద ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. పేలుళ్ళతో మా ప్రాణాలు పోయాక పట్టించుకుంటారా అంటూ నినాదాలు చేశారు. క్వారీ పక్కనే రాజాపూర్ గ్రామం ఉండడంతో బ్లాస్టింగ్‌ల వల్ల పెద్ద బోల్డర్ ఇండ్ల మధ్య పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక మొత్తంలో బ్లాస్టింగ్ వల్ల ఇల్లు పగళ్ళుతోపాటు దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎస్ఐ చంద్రకుమార్, పోలీసులు చేరుకొని సింగరేణితో మాట్లాడతామని హామీ నివ్వడంతో శాంతించారు.



ఓసీపీ-3 పిట్ సెక్రెటరీగా రవీందర్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టు ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీగా కొంగర రవీందర్ నియమితులయ్యారు. ఈమేరకు యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు. యూనియన్ బలోపేతం, ఓసీపీ-3 కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దిశగా కృషి చేయాలని సూచించారు.

2వ రోజుకు చేరిన దీక్ష

కోల్‌సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇజ్రాయెల్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం కొన సాగుతోంది. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాం డ్ చేశారు. దీక్షలో మురళీధర్, తౌటం సతీష్, సంజయ్, ఉమర్, జూపాక వెంకటి, మనోహర్, జవ్వాజి శ్రీనివాస్ దీక్షలో కూర్చున్నారు.

మాదిగ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి



యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫే ర్ అసోసియేషన్(365/22)కు యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వాలని అసోసియేషన్ నాయకులు గురువారం సంస్థ సీఎండీ బలరాంకు వినతిపత్రాన్ని అందజేశారు. సిం గరేణిలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ అమలుపై నివేదికను అందజేశారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లకు ఇస్తున్న విధంగా తమ అసోసియేషన్‌ను గుర్తించాలని, అసోసి యేషన్ కార్యాలయ నిర్వహణ నిమిత్తం కంపెనీ క్వార్టర్ కేటాయించాలని సీఎండీని కోరారు. మాదిగ ఉద్యోగుల రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇతర అంశాల పరిశీలన నిమిత్తం ఒక మాదిగ చీఫ్ లైజనింగ్ ఆఫీసర్‌ను, ఆయా ఏరియాల వారిగా లైజనింగ్ ఆఫీర్లను నియమించాలని విజ్ఞప్తిచేశారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, ప్రెసి డెంట్ మోహన్, అడ్వయిజర్ రాజేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, కృష్ణ, ఉన్నారు.